www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 09 | ఫిబ్రవరి | 2025
పేజీలు 8

## రేషన్ షాపుకు తాళం వేసిన గ్రామస్తులు



-బియ్యం ఇవ్వకుండా బయటకు తరలిస్తున్న వైనం
-డీలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

2 లో

## కడుపు నిండుగా..
# చదువు మెండుగా..!





పదోతరగతి పరీక్షలు మార్చి 21 నుంచి నిర్వహించడానికి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. సర్కారు బడుల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పునశ్చరణ చేస్తూ వారి సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 6 గంటల వరకు బడిలో ఉండాల్సి వస్తోంది. దీంతో అర్థాకలితో చదువులపై ప్రత్యేక దృష్టి సారించలేకపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వాలని నిర్ణయించింది.

-ప్రజాపక్షం/చింతకాని

2 లో

-పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అల్పాహారం
-ఒక్కో విద్యార్థికి రూ.15 కేటాయింపు
-రోజుకో విధంగా అందజేత

## స్థానిక సంస్థల ఎన్నికలకు
# సిద్ధం కండి

### సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



ప్రజాపక్షం/చింతకాని : త్వరలో జరగబోయే స్థానికి సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పిలుపునిచ్చారు.శుక్రవారం రాత్రి చింతకాని మండలం నేరడ సీపీఐ గ్రామశాఖ 15వ మహాసభ గోగుల ఆది , పెరిక ప్రభాకర్ ల అధ్యక్షతన జరిగింది. తొలుత్త సీనియర్ నాయకులు గోనుగుంట్ల వెంకన్న పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో

మిగతా 2లో..

# నాణ్యతకు, నమ్మకానికి చిరునామా లలితా జ్యువెల్లరి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : నాణ్యతకు, నమ్మకానికి చిరునామా లలితా జ్యువెల్లరి అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలో లలితా జ్యువెల్లరిషోరూంను ప్రజలకు అందుబాటులోకి తేవడం శుభ సూచకమన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో ఏర్పాటు చేసిన లలితా జ్యువెల్లరి 60వ బ్రాంచ్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలోనే అగ్రగామి జ్యువెల్లరి

మిగతా 2లో..

-లలితా జ్యువెల్లరి షోరూంను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
-డబ్బులు ఎవరికి ఊరికే రావు
-షోరూం అధినేత కిరణ్‌కుమార్

## మనస్సు లఘ్నం చేసి పిలిస్తే స్వామి సాక్షాత్కారం



ప్రజాపక్షం/భద్రాచలం : మనస్సును లఘ్నం చేసి స్వామిని పిలిస్తే ఆయన సాక్షాత్కరిస్తారంటూ త్రిదండి చిన్నజీయర్ స్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా భీష్మఏకాదశి సందర్భంగా శనివారం వైభవోపేతంగా విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాళాశాల మైధానం భక్తులతో నిండిపోయింది. ముందుగా జీయర్ మఠం, కోర్టు ప్రాగణం నుండి బస్టాండ్ మీదుగా కళాశాల మైధానానికి స్వామి వారి శోభోయాత్ర ప్రత్యేకరథంలో సాగింది. మేళతాళాల నడుమ సాగిన ఈ యాత్ర ముందుభాగంలో కోలాట, కూచిపూడి నృత్యాలు, వివిధ విచిత్ర వేషధారణలను ఆకట్టుకున్నాయి. జూ.కళాశాల మైధానం వేదికపై స్వామివారిని ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు చేశారు. జీయర మఠం జెండాను ఎగురవేశారు. చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో సాగిన ఈ స్తోత్ర పారాయణ కార్యక్రమానికి పట్టణం నుండే కాకుండా పలు ప్రాంతాల నుండి వేలాది మంది

మిగతా 2లో..

త్రిదండి చినజీయర్ స్వామి
- ఘనంగా విష్ణు సహస్రనామ స్తోత్రం
- హాజరైన వేలాదిమంది భక్తులు
- పట్టణంలో శోభాయాత్ర, ప్రత్యేక పూజలు

# కడుపు నిండుగా.. చదువు మెండుగా..!

**ప్రజాపక్షం/చింతకాని :** పదోతరగతి పరీక్షలు మార్చి 21 నుంచి నిర్వహించడానికి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. సర్కారు బడుల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందుకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పునశ్చరణ చేస్తూ వారి సందేహాలు నివృత్తి చేస్తున్నారు. ఉదయాన్నే 8 గంటలకు వచ్చిన విద్యార్థులు సాయంత్రం 6 గంటల వరకు బడిలో ఉండాల్సి వస్తోంది. ఈ క్రమంలో సాయంత్రం పూట ఆర్థాకలితో అలమటిస్తున్నారు. దీంతో చదువులపై ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం విద్యార్థులకు స్నాక్స్ ఇవ్వాలని నిర్ణయించింది.

**ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8468 మంది...**

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో 8468 మంది పదో తరగతి చదువుతున్నారు. వీరికి సాయంత్రం పూట అల్పాహారం (స్నాక్స్) ఇస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 1 నుంచి ప్రారంభించారు. మార్చి 20వ తేదీ వరకు విద్యార్థులకు స్నాక్స్ ఇస్తారు. ఇందు కోసం ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రోజుకు రూ.15 చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన 8468 మందికి రోజుకు 1,27,020 రూపాయలు ఖర్చు అవుతుంది.

**రోజుకో విధంగా...**

49 రోజుల పాటు స్నాక్స్ ఇస్తారు. ఒక్కో రోజు ఒక్కో స్నాక్స్ అందిస్తారు. ఇందులో భాగంగా ఉడకబెట్టిన పెసలు, బొబ్బర్లు, మిల్లెట్ బిస్కెట్లు, పల్లీ పట్టీలు, సెనగలు, ఉల్లిగడ్డ పకోడి ఇస్తున్నారు. వీటిని మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వహకులే తయారు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు మేలు కిలారు స్పందన ,పదోతరగతి విద్యార్థి,జడ్పీ ఉన్నత పాఠశాల ,నాగులవంచ ప్రభుత్వ నిర్ణయంతో మాలాంటి పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత సాయంత్రం ఇంటికి వెళ్లే లోపు నీరసించి పోకుండా ప్రభుత్వం అల్పాహారం కోసం నిధులు మంజూరు చేయడంతో మాకు పాఠశాలలో అల్పాహారం అందిస్తున్నారు. దీంతో ప్రత్యేక తరగతులకు హాజరుకావడానికి అవకాశం కలిగింది. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇది ఉపకరిస్తుంది.

**అల్పాహారం అందిస్తున్నాం : వీరపనేని శ్రీనివాసరావు, ఎంఈవో, చింతకాని**

ప్రతి విద్యార్థికి సాయంత్రం అల్పాహారం అందిస్తున్నాం. ఇందుకు సంబంధించిన నిధులు మంజూరయ్యాయి. ఒక్కో రోజు ఒక్కో రకం ఇచ్చేలా మార్గదర్శకాలు చేశాం. మధ్యాహ్న భోజన నిర్వహకులే దీన్ని అందిస్తున్నారు.

| జిల్లా | విద్యార్థులు | మంజూరైన నిధులు |
|---|---|---|
| ఖమ్మం | 5347 | 30,47,790 |
| భద్రాద్రి-కొత్తగూడెం | 3121 | 17,78,970 |

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి



(మొదటిపేజీ తరువాయి)

అధిక స్థానాల్లో పోటీ చేసేలా సమాయత్తం కావాలన్నారు. గతంలో అధికారం చేపట్టిన గ్రామాలతో పాటు కొత్తవాటిని గెలుపొందేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అభివృద్ధి కోసం రాజీలేని పోరాటాలు చేయాలన్నారు. 30ఏండ్ల సుదీర్ఘపోరాటమైన ఎస్సీ వర్గీకరణను ఆమోదిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని, అట్టి ఆమోదాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేసి ఈవర్గాలకు న్యాయం చేయాలన్నారు. అదే విధంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుండి బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజలకు ఎంత మాత్రం ప్రయోజనం కలుగలేదన్నారు.వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెరగడం, పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాలన్నారు.అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా దస్తగిరి, సహాయ కార్యదర్శులుగా మట్టా రవి, కె మహేష్‌తో పాటు 19మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, సీనియర్ నాయకులు దూసరి శ్రీరాములు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జున్,సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు షేక్ దస్తగిరి,మట్టా రవి, వెంకట్రావ్, బాబు, ధనలక్ష్మి, శీలం రాజ్యలక్ష్మి ,నాగులమీరా, సీతారాములు

# నాణ్యతకు, నమ్మకానికి చిరునామా లలితా జ్యువెల్లరి

(మొదటిపేజీ తరువాయి)

సంస్థగా ఉన్న లలితా జ్యువెల్లరి ఇప్పుడు ఖమ్మంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తయారీ ధరకే బంగారు, వజ్రాభరణాలను ఈ సంస్థ అందిస్తుందని వారు తెలిపారు. ఇతర షోరూంలలో లభించని సరికొత్త మోడల్, బంగారు, వజ్రాభరణాలు ఇక్కడ లభిస్తాయని వారు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో విశేష ఆదరణ పొందిన లలితా జ్యువెల్లరి సంస్థను ఖమ్మం జిల్లా ప్రజలు కూడా ఆదరిస్తారని వారు ఆకాంక్షించారు. లలితా జ్యువెల్లరి షోరూం అధినేత ఎం. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డబ్బులు ఊరికే ఎవరికి రావని ఇతర షోరూంలలో బంగారు ధరలను చూసి మా వద్ద ఉన్న ధరలను పోల్చుకుని ఆ తర్వాతే కొనుగోలు చేయాలని వినియోగదారులను కోరారు. తక్కువ ధరకు నాణ్యమైన బంగారు, వజ్రాభరణాలను అందించడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో తమ బ్రాంచ్‌లు వైజాగ్, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, భీమవరం, కాకినాడ, చిత్తూరు, నెల్లూరు, గూడూరు, సుళ్లూరుపేట, గుంటూరు, శ్రీకాకుళం, గోపాలపట్నం, అనకాపల్లి, గాజువాక, విజయనగరం, తుని, అనంతపురం, కడప, ఒంగోలు, కర్నూలు, నర్సారావుపేట, అమలాపురం, నిజమాబాద్, వరంగల్, మిర్యాలగూడెం, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, సోమాజిగూడ, దిల్‌సుఖ్ నగర్, చందా నగర్, సుచిత్ర సర్కిల్ లలో ఉన్నాయని ఇప్పుడు 60వ బ్రాంచ్‌ని ఖమ్మంలో ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. దక్షిణ భారతదేశ వ్యాప్తంగా మా సంస్థను విస్తరింపజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు మా ఇతర షోరూంలకు వచ్చి నగలు కొనుగోలు చేస్తున్నారని గుర్తించి ఖమ్మంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా ప్రజలు తమ సంస్థను ఆదరించాలని కోరారు. బంగారు నగల కొనుగోలుకు సంబంధించి పలు స్కీములను కూడా అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమజోహారా, కార్పొరేటర్ పాకాలపాటి విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



# మనస్సు లగ్నం చేసి పిలిస్తే స్వామి సాక్షాత్కారం

(మొదటిపేజీ తరువాయి)

భక్తులు తరలివచ్చారు. విష్ణునామాలను జీయర్ స్వామి నోట పలుకుతుండగా భక్తులు ఏకకంఠంలో అదే స్తోత్రాన్ని అనుకరించారు. దీంతో భద్రాచలం పట్టణం భక్తి భావంతో తొణికిసలాడింది. పట్టణంలో ఏర్పాటు చేసిన మైకుల ద్వారా పారాయణ స్తోత్ర పఠనం వస్తుంటే రోడ్ల వెంట వెళ్ళే వారు సైతం మనస్సుల్లో పఠిస్తూ పెదవులను కదిలించడం కనిపించింది. ఈ సందర్భంగా జీయర్ స్వామి మధ్యమధ్యలో మాట్లాడుతూ దేవున్ని పారాయణం చేయాలంటే మనస్సు ముందుగా లగ్నం చేయాలని, ఏకాగ్రతతో స్వామిని స్మరించడం వల్ల దైవశక్తులు ఆవాహనం అవుతాయని చెప్పారు. కొబ్బరికాయలు, పూలు, పండ్లు, పండ్ల రసాలతో అభిషేకాలు, పాలాభిషేకాలు నేరుగా స్వామికి చేయకున్నా పర్వాలేదని, మనస్సులో చేస్తున్నట్లు అనుకుని స్వామిని తలుచుకుంటే దేవప్రసన్నత ప్రక్కనే ఉంటుందని, అలాంటి భక్తిభావాన్ని పెంపొందించుకునేందుకే ఈ దైవకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏకకంఠంతో ఇంత మంది విష్ణుసహస్రనామ పారాయణ స్తోత్రం చేస్తుంటే ఆ లయకారుడు పరవశించిపోతాడని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం అర్చకులు, జీయర్ మఠం, వికాసతరంగిణి, శ్రీగోవింద రంగనాథ మందిరం సభ్యులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# వెంకటగిరిలో డిజిటల్ క్రాప్‌సర్వే పరిశీలన

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కూసుమంచి సహాయ వ్యవసాయ సంచాలకులు బి. సరిత డిజిటల్ క్రాప్ సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు యాసంగి పంటలు నమోదు చేయించుకోవాలని, సూచించారు. అలాగే వరి, మొక్కజొన్న పంటల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం గుదిమళ్లలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమాలలో మండల వ్యవసాయ అధికారి జె. ఉమానగేష్, వ్యవసాయ విస్తరణ అధికారి ఆదర్శ్, రైతులు పాల్గొన్నారు.

# సెంటర్ డివైడర్ క్లీన్ అండ్ గ్రీన్ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో సెంటర్ డివైడర్ శుభ్రత కార్యక్రమాన్ని మున్సిపాల్ సిబ్బంది చేపట్టారు. శనివారం సెంట్రల్ డివైడర్ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని మున్సిపాల్ కమీషనర్ చింతా వేణు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ చింతా వేణు మాట్లాడుతూ డివైడర్ పూర్తిగా శుభ్రపరిచి మొక్కలకు నీరు పెట్టాలని, పచ్చదనం ఉండే విధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా ఎండలు ప్రారంభమైన నేపథ్యంలో కార్మికులు జాగ్రత్తలు పాటించాలని వడదెబ్బ తగలకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్వామివారి నిత్యాన్నదానానికి రూ.1,00116 విరాళం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నందు నిత్య అన్నదాన పథకానికి బనిగండ్లపాడు గ్రామానికి చెందిన అడ్వకేట్ కోనా చంద్రశేఖర్‌గుప్త స్నేహితుడు హైదరాబాద్‌కు చెందిన నర్సింగోజు శశాంక్, కావ్య దంపతులు ఒకలక్ష నూటపదహారు రూపాయలు విరాళంగా ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావుకు శనివారం అందించారు. ముందుగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ నిర్వాహకులు వారికి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. జమలాపురం ఆలయ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయానికి వచ్చిన భక్తులకు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు చెందిన తోటకూర నవీన్‌కుమార్,దుర్గామల్లేశ్వరిదంపతులు, పసుపులేటి శివప్రసాద్, పద్మావతి దంపతుల వితరణతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సేవా సమితి కార్యదర్శి నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కావటం వేలాదిమంది స్వామి వారికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించగా వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ షాపుకు తాళం వేసిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/కామేపల్లి:** మండలంలోని బండిపాడు రేషన్ షాప్‌కు శనివారం ఆగ్రహించిన గ్రామస్తులు తాళం వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. రేషన్ డీలర్ కుమారుడు నరేందర్‌ను నిలదీశారు. సక్రమంగా బియ్యం పంపిణీ చేయకుండా బయట మార్కెట్‌కు తరలిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు. రేషన్ షాపు రెండు మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు తీయడం లేదని తాము బియ్యం కోసం వస్తే బియ్యం లేకపోవడంతో అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు రెవిన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

**రెండు రేషన్ షాపుల్లో బియ్యం నిల్వలలో తేడాలను గమనించిన అధికారులు...**

బర్లగూడెం గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మణ్ రెండు 6ఏ కేసులు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ పవన్ విలేకరులకు తెలిపారు. ఈ డీలర్‌పై ప్రజల నుండి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సివిల్ సప్లై అధికారులు బండిపాడు, బర్లగూడెం రేషన్ షాపులను తనిఖీ చేశారు. రేషన్ బియ్యం లెక్కల్లో భారీ తేడాలను గుర్తించారు. బండిపాడు రేషన్ షాపులో 21.05 క్వింటాల రేషన్ బియ్యం ఉండాల్సి ఉంగా కేవలం 4క్వింటాలు మాత్రమే ఉన్నాయి. బర్లగూడెం రేషన్ షాప్‌లో 51.25 క్వింటాలు రేషన్ బియ్యం కనపడకుండా పోయాయి. దీంతో సదరు డీలర్‌పై రెండు 6 ఏ కేసులు నమోదు చేసి స్థానిక తహసీల్దార్‌కు స్టాక్‌ను అప్పగించినట్లు వారు వెల్లడించారు. ఈ రెండు షాపులను తాత్కాల్కంగా బర్లగూడెం డీలర్ మూడు వినయ్‌కుమార్‌కు అప్పగించినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు..

**ఆగని రేషన్ డీలర్ల దందా...**

రాష్ట్ర ప్రభుత్వం వేలి ముద్రలు ద్వారా రేషన్ ఇస్తున్నప్పటికీ డీలర్లు ఎప్పటికప్పుడు కొత్త దందాలు కొనసాగిస్తున్నారు. కొన్ని రేషన్ షాపుల్లో కొందరు డీలర్లు స్టాక్ మొత్తం అమ్ముకుండా మూడు నాలుగు రోజులు పాటు రేషన్ షాప్‌కు వచ్చిన వారికి బియ్యం ఇచ్చి మిగతా బియ్యాన్ని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మండలంలో కొందరు డీలర్లపై పలు మార్లు 6 ఏ కేసులు నమోదు అవుతున్న లైసెన్సులను క్యాన్సల్ చేస్తున్నా ఆ కేసులు ద్వారా ఎలాంటి శిక్షలు రేషన్ డీలర్లకు పడకపోవడం లైసెన్సులను రెన్యువల్ చేయడంతో మరో సారి వారికే డీలర్ షిప్ దక్కటంతో వీరి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇప్పటికైనా సివిల్ సప్లై, రెవిన్యూ అధికారులు స్పందించి రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటే ప్రజాపంపిణీ వ్యవస్థ గాడిలో పడుతుందని పలువురు అంటున్నారు.

# బ్రెయిన్‌స్ట్రోక్‌తో సిపిఐ నాయకుడు అప్పారావు మృతి





**- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు, గూడూరుపాడు సిపిఐ శ్రేణులు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామానికి చెందిన సిపిఐ నాయకుడు పల్లపాటి అప్పారావు(48) బ్రెయిన్‌స్ట్రోక్‌తో శనివారం ఇంటి వద్ద హఠాన్మరణం చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, జిల్లా పార్టీ భౌతికకాయాన్ని సందర్శించి ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే హైదరాబాద్‌లోని సిపిఐ కార్యాలయంలో మీటింగ్ నుంచి ఫోన్ ద్వారా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగంహేమంతరావు, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, నివాళిని అర్పించారు. అప్పారావు హఠాన్మరణంతో కుటుంబ సభ్యులు, ఆ శాఖ సిపిఐ శ్రేణులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సింగు నరసింహారావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, యడ్లపల్లి శంకరయ్య, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు వెంపటి సురేందర్, బండి ఉపేందర్, మారుతి రామారావు, దొడ్డ వాసయ్య, కర్ణం పెద్ద ఉపేందర్, పొడేటి అంజయ్య, ఎర్రబోయిన వెంకటనరసయ్య, బండి పెద్ద ఉపేందర్, చల్లా రామకృష్ణ, పోటు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు దొబ్బల మురళి

**సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల, కొండపర్తి**



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు రాఘవాపురం గ్రామానికి చెందిన దొబ్బల మురళి రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతిచెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు రాఘవాపురం చేరుకొని మురళీ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురళి బ్రతికినంత కాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.కొదుమూరు, రాఘవాపురం గ్రామాల్లో శాఖ పునః నిర్మాణంలో మురళి పాత్ర ఎనలేనిదన్నారు. మురళి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మురళి కుమారులు శ్రీధర్,రమణలను ఒదార్చి ధైర్యం చెప్పారు.నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, జిల్లా సమితి సభ్యులు కూచిపుడి రవి, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, నాయకులు కొల్లి సీతయ్య, దొబ్బల వెంగళరావు,అప్పారావు, లక్ష్మయ్య, బాబు, బాలాజీ, కొల్లి రవి, గోవిందరావు, ఆళ్ల రవీందర్, సింగారపు సత్యనారాయణ, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జున, చ లమల అనిల్, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలి

**-మంత్రి తుమ్మలను కలిసిన కమ్మ మహాజన సంఘం కమిటీ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ కమ్మ జాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం నూతన కమిటీ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో కమ్మ సంఘం సభ్యులు కీలకంగా ఉండాలని ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా సంఘాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని నూతన కమిటీ భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. సేవా కార్యక్రమాల ద్వారా సంఘానికి మంచి పేరు తీసుకు రావాలని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా నూతన కమిటీకి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము, ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మల, కార్యవర్గ సభ్యులు మోతుర్కి సత్యనారాయణ, కోలేటి నవీన్, మేదరమెట్ల స్వరూపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వర్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, సంఘం నాయకులు పునుకొల్లు రాంబ్రహ్మం, రావూరి సైదబాబు, రాంబాబు, తాళ్లూరి మురళికృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో ముగిసిన స్పోర్ట్స్ మీట్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. రెండు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, హార్డిల్స్, టెన్నికాయిట్ తదితర పోటీలను నిర్వహించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ విద్యార్థులు గెలు పొటములను క్రీడా స్ఫూర్తితో తీసుకోవాలన్నారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచేలా స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని ఏసిపి అభినందించారు. కరస్పాండెంట్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి విద్యార్థి క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రతి ఏడాది స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశ భక్తి, జానపద, సంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రామాలయంలో మంత్రి తుమ్మల పూజలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 54వ డివిజన్ టిడిపి ఆఫీస్ పక్కన గల రామాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం రామాలయం ఆరవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేందర్, ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఖమ్మం కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయ ఇంచార్జి ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయం పక్కన గల హాల్ నందు నిర్వహించే ఈ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారని వారు తెలిపారు.ఈ సమావేశానికి ఖమ్మం నగర, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మార్కెట్, ఆత్మ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లు, సొసైటీ ఛైర్మెన్లు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# ఎస్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వేద వర్షిత



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన చీదిరాల వేద వర్షిత ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. వేలాది మంది వ్రాసిన ఈ పరీక్షకు వైరా నుండి తను ఎంపికైంది. వేద వర్షిత వైరాలోని జెడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 8వతరగతి చదువుతుంది. వేద వర్షిత సాధించిన ఈ విజయానికి జెడ్పిహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం వెంకట మల్లేశ్వరి, ఉపాధ్యాయులు గాయత్రి, సరళ, రమాదేవి, నాగమణి, సుశీల, రాణి, రామలక్ష్మి , బాదంశెట్టి వాసు తదితరులు అభినందనలు తెలియజేశారు.

# 10న సిపిఐ మండల సమితి సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మంరూరల్ మండలంలోని ఎం. వెంకటాయపాలెం గ్రామంలో సిపిఐ మండల సమితి సమావేశాన్ని 10వ తేదీ(సోమవారం) నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభం కానుందని, జిల్లా సమితి, మండల సమితి సభ్యులు హాజరుకావాల్సిందిగా కోరారు. దీనికి సిపిఐ పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌తో పాటు పలువురు నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎస్‌బిఐటి విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎస్‌బిఐటి కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. రాష్ట్ర స్థాయి డిప్లొమా స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో భాగంగా ఈనెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో జరిగే పోటీలకు తమ కళాశాల జట్టు ఎంపిక కావడం గర్వనీయమన్నారు. గత నెల కొత్తగూడెం రుద్రంపూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా తమ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించి ఖమ్మంజిల్లా ఖ్యాతిని చాటలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. రాష్ట్ర స్థాయిలో కూడా విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జె. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, డిప్లొమా ఏవో జహీరుద్దీన్, ఫిజికల్ డైరెక్టర్లు జగదీష్, శివాజి తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా ఆటోడ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఆటోడ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘట న మండల పరిదిలోని గోపవరం గ్రామం గ్రీన్‌ఫీల్డ్ హైవే బ్రిడ్జ్ ప్రక్కన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చింతకాని మండలం నాగిలిగొండ గ్రామానికి చెందిన చాట్ల భిక్షం (45) కొణిజర్ల నుంచి నాగిలిగొండవరకు రోజు ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం గ్రామస్థులు గ్రీన్‌ఫీల్డ్ హైవేరోడ్డు దగ్గరలో గోపవరం రోడ్డు ప్రక్కన మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చారు. విషయం తెలుసుకున్న వైరా ఏసీపి రెహమాన్, వైరా సిఐ సాగర్, కొణిజర్ల ఎస్సై సూరజ్, చింతకాని ఎస్సై నాగుల్‌మీరా సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య సుజాత, కుమారులు శ్రీరామ్, రామ్‌చరణ్ లు ఉన్నారు. పెద్ద కుమారుడు శ్రీరామ్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు జోహార్లు అర్పిస్తున్న ప్రజలు : గిరిబాబు



ప్రజాపక్షం/జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలు కలిసి ప్రాంతీయ పార్టీలను ఓడించాలని టార్గెట్ గా పెట్టుకున్నాయని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పరిపాలన వాళ్ళ దేశవ్యాప్తంగా ఆ పార్టీకి కాలం చెల్లిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం కావడంతో మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా ఎన్నికల్లో ఎన్ని మాటలు చెప్పినా ప్రజలు కాంగ్రెస్ ని పట్టించుకోలేదు అని అన్నారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయడం కోసం బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్క సీటు కూడా గెలవని కాంగ్రెస్ పార్టీకి ఇంకా దేశంలో మనుగడ కష్టమే అని గిరిబాబు అన్నారు.

## తాగునీటి నిర్వహణపై డిఈ పరిశీలన



ప్రజాపక్షం/పెనుబల్లి:పెనుబల్లి మండలంలో త్రాగునీటి నిర్వహణ పై సంబంధిత శాఖ అధికారులతో రక్షిత మంచినీటి శాఖ డిఇ కె జయలక్ష్మి శనివారం పరిశీలించారు. ఉప్పలచెలక, లింగగుడెం, బయ్యన్నగుడెం గ్రామాల్లో మంచినీటి సరఫరా ఎలా జరుగుతుంది అని పరిశీలించి వేసవికాలంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా మిషన్ భగీరథ నీటిసరఫరాతో పాటు స్థానికంగా ఉన్న బోర్లు నిర్వహణపై నీటి సరఫరా సజావుగా సాగేందుకు తగు సూచనలు చేశారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంక్‌లను పరిశుభ్రంగా ఉంచి, మంచినీటి సరఫరా చేసే పైపుల లీకేజీలను అరికట్టాలని, త్రాగునీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. త్రాగునీటి సమస్యలపై ప్రజల ఇబ్బంది పడకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## వలస ఆదివాసీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



ప్రజాపక్షం/పినపాక: పినపాక మండలంలోని వలస ఆదివాసి గ్రామం పిట్టతోగు గ్రామంలో వలస ఆదివాసీల చదువు కోసం ఏర్పాటుచేసిన శ్రీ సత్య సాయి పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యా ఉపయోగిత సామాగ్రిని అందజేశారు. శనివారం మహర్షి స్వచ్ఛంద సేవా సంస్థ సంస్థ ఆధ్వర్యంలో ఐటీడీఏ ట్రైబల్ మ్యూజియం ఉద్యోగి రమణ అందజేశారు. అనంతరం స్వచ్ఛంద సేవ అధ్యక్షులు తొలేం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని ఉద్దేశంతో శ్రీ సత్య సాయి పాఠశాల ఆదివాసి గ్రామాలలో విద్యా సౌకర్యాలను మెరుగు పరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి అనూష, గ్రామస్తులు సంతోష్, మహేష్, ఎర్రయ్య, బద్రి, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు

## మణుగూరులో ఆధార్ సెంటర్లు తక్షణమే సేవలు అందించాలి



ప్రజాపక్షం/మణుగూరు: లక్ష జనాభా కలిగినటువంటి మణుగూరు లో గవర్నమెంట్ మీసేవ పనిచేయక రోజులు గడుస్తున్నా పట్టించుకున్న నాధులే లేరని ఈ విషయమై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి మణుగూరు పట్టణంలో ప్రజలకు వివిధ రకాల ఆధార్ సేవలు తక్షణమే గవర్నమెంట్ మీసేవ ద్వారా అందించాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే అంబేద్కర్ సెంటర్లో ఉన్నటువంటి ఎస్‌బిఐ లో ఉన్న ఆధార్ కేంద్రం కూడా పనిచేయటం లేదన్నారు. ఇలా ఈ రెండు ఆధార్ సెంటర్లు పని చేయనందున కొత్తగా తీయించుకునేవారు మార్పులు, చేర్పులు చేయాలనుకునే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నటువంటి పరిస్థితి మా దృష్టికి వచ్చిందని తెలియజేశారు. మణుగూరు ప్రజలు ఆధార్ సేవల కోసం ఇతర మండలాలు ఇతర పట్టణాల్లోకి వెళ్లి కూడా ఆధార్ తీసుకోవాలి అని ప్రయత్నం చేస్తే అక్కడ కూడా వారి ఆశలు అడియాశలు అవుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

## మార్చి 2న జరిగే కాసాని సంస్మరణ సభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/సుజాతనగర్: మార్చి 2న జరిగే జననేత కాసాని ఐలయ్య సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య కోరారు. శనివారం సుజాతనగర్ సిపిఎం ఆఫీస్‌లో అఖిలపక్ష పార్టీల సమావేశం నర్రా శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ అఖిలపక్ష సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కనకయ్య మాట్లాడుతూ ఐలయ్య మరణం ఈ ప్రాంతానికే కాదు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీరని లోటు అని, పాల్వంచ నుంచి పాపుకొల్లు వరకు 20,000 ఇళ్ల స్థలాలు పేదలకు పంచిన మహానుభావుడు అని, ప్రజలు హృదయాల్లో గూడు కట్టుకున్న నేత కామ్రేడ్ కాసాని అని వారి యొక్క ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. మార్చి రెండో తేదీన జరిగే కాసాని సంస్మరణ సభకు పార్టీ జాతీయ నాయకులు బివి రాఘవులు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు హాజరవుతున్నారని, ఈ సంస్కరణ సభను జయప్రదం చేయాలని ఆయన అన్నారు. కామ్రేడ్ కాసాని ఉద్యమ సహచరులు కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీరమంతరావు మాట్లాడుతూ కాసానితో నాకు 40 ఏళ్ల అనుబంధం ఉందని నా రాజకీయ గురువు కామ్రేడ్ కాసాని ఐలయ్య అని 1981లో ఆయన సర్పంచ్ గా నేను ఉపసర్పంచ్ గా కలిసి పనిచేశామని ఈ ప్రాంత ఉద్యమాన్ని వామపక్ష ఉద్యమ నిర్మాణంలో కలిసి పనిచేసే ఆయన దగ్గర రాజకీయ ఎత్తుగడలు నేర్చుకొని నేను ఈ స్థాయికి రావటానికి ప్రధాన కారణం కాసాని అని చివరి రోజు ఆయన నాతో తన భావాలను ఫోన్‌లో పంచుకొని చివరి శ్వాస వరకు ప్రజల గురించి ఆలోచించటం కామ్రేడ్ కాసానికే సాధ్యమని ఉద్యమ నేత మరణించటం బాధాకరమని ఆయన ఆశయాల కొనసాగించడం కోసం ఈ సభకు నేను సహకరిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి కోమరి హనుమంతరావు మాట్లాడుతూ కాసాని ఐలయ్య మరణం ఈ ప్రాంతానికి తీరనిలోటని మార్చి 2న జరిగే సభకు సహకరిస్తామని ఆయన ఉద్యమ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తామని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకులు మడిపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అందరితో కలుపుగోలుగా వివరించే వారిని ప్రధానంగా వ్యవసాయ కూలీలు అంటే ఎనలేని ప్రేమని ఆయన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడమే మన ముందున్న కర్తవ్యం అనే కొనియాడారు. జలగం యువసేన నాయకులు చింతలపూడి జగన్ మాట్లాడుతూ కామ్రేడ్ కాసాని ఈ ప్రాంత వామపక్ష ఉద్యమాలు నిర్మించడంలోనూ సుందరయ్య లాంటి పాత తరం నాయకులతో పాత తరం నేతలతో పోల్చదగిన వ్యక్తి కామ్రేడ్ కాసాని ఐలయ్య అని నిజాయితీగల నిప్పులాంటిమనిషి జననేత కాసాని అయిలయ్య అని ఆయన సంస్మరణ సభకు అఖిలపక్షం తరపున మీమందరం సహకరిస్తామని ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మా మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఆయనతో కలిసి పని చేశానని నన్ను సుజాతనగర్ సర్పంచ్ గా ఈ ప్రాంతంలో పార్టీ మండల కార్యదర్శిగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చినటువంటి వ్యక్తి కామ్రేడ్ కాసాని అని నా రాజకీయ గురువు కోల్పోవడం చాలా బాధాకరమని ఆయన ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ అఖిలపక్ష సమావేశంలో సిపిఐ నాయకులు బొడ్డు కేశవరావు, సిపిఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్, సిపిఎం నాయకులు కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, కొండ కృష్ణ, చిప్పిడి వెంకటేశ్వర్లు, బానోత్ కుమారి, గూని నాగచందర్, బాణోత్ జ్యోదిరాం, బాలు వెంకటేశ్వర్లు, వీర్ల సత్యం, బానోత్ వీరు, గుగులోత్ జగన్, మద్దెల ప్రసాద్, సట్టు నరసింహారావు, కొలహలం శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

**గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు అండగా అఖిలపక్షం**



ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: గత 8 రోజులుగా జరుగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతుగా శనివారం లక్ష్మీ దేవిపల్లి కేంద్రంలో మండల కేంద్రంలో దీక్షా శిబిరం వద్ద అఖిలపక్ష పార్టీల నాయకులు కార్మిక ఒసఘాలు గ్రామపంచాయతీ కార్మికుల సమక్షంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ లక్ష్మీ దేవిపల్లి మండల కేంద్రంలో ఆరు పంచాయతీల కార్మికులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ఫిబ్రవరి10న జిల్లా కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలోని ఉమ్మడి లక్ష్మీ దేవిపల్లి గ్రామపంచాయతీ నుండి విడిపోయిన శ్రీనగర్ కాలనీ, సంజయ్‌నగర్, ప్రశాంత్‌నగర్, లోతు వాగు, లక్ష్మీ దేవి పల్లి, అశోక్‌నగర్ కాలనీ గ్రామపంచాయతీ వర్కర్స్, సిబ్బంది గత 20 సంవత్సరాల నుండి గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి గత పాలకవర్గం తీర్మానాల మేరకు కేటగిరీల వారీగా రూ.12వేల నుండి రూ.17వేల వరకు ప్రతినెల వేతనంగా పొందుతున్నారని, పాలకవర్గం ముగిసిన తర్వాత కొన్ని చిన్న పంచాయతీలు ఆర్థికంగా వెనుకబాటు వలన కార్మికులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఒక్కొక్కరికి సుమారు 10 నెలలు, 5 నెలలుగా వేతన బకాయిలు ఉన్నందున ఈ మధ్య రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా కనీస వేతనముగా జీవో నెంబర్51 ప్రకారం ఒక్కొక్క కార్మికుడికి రూ.9500లు చొప్పున వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. 51 జీవోను రద్దు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. లేనియెడల సమ్మెను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు భూక్యా రమేష్, టిఆర్ఎస్ నాయకులు కొట్టి వెంకటేశ్వర్లు, నవతన్, సిపిఐ నాయకులు లగడపాటి రమేష్, నున్నా ధనుంజయ్, మిరియాల రాము, సాధిక్,జర్పుల మురళి, పిల్లలమర్రి మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలుకై చలో హైదరాబాద్



ప్రజాపక్షం/కారేపల్లి: కాంగ్రెస్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 420 హామీలను నెరవేర్చాలని ఈనెల 20 తారీఖున ఛలో హైదరాబాద్ మహా ప్రదర్శన సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా కారేపల్లి మండలం వేరుపల్లి జవాన్ల పెళ్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్న వివిధ రకాల సర్వేలకే పరిమితమైందని ఎన్నికలకు ముందు ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటామని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 420 హామీలను ఇంత వరకు ఏ ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రేషన్ కార్డులు పోడు భూములకు పట్టాలు కౌలు రైతులకు రైతులందరికీ ఎకరానికి రూ 15వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ 12వేల, కింటాకు రూ 500 బోనస్, చేయూత పథకం కింద నెలకు 4000రూపాయల పెన్షన్ వివిధ రకాల పింఛన్లు కనీస వేతనం చట్టం అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈనెల 20 తేదీన హైదరాబాద్‌లో జరుగు మహా ప్రదర్శనను సభను అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కంచర్ల శ్రీనివాస్ రెడ్డి, అలెం చంద్రయ్య, బుర్ర కోటమ్మ, సుగుణ, పద్మ, లక్ష్మీ , సరోజ, తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ బంకుల్లో సౌకర్యాలు నిల్..!

**-నిబంధనలకు తిలోదకాలు**
**-పట్టించుకోని సంబంధిత అధికారులు**



ప్రజాపక్షం/పినపాక: ఉరుకులు, పరుగుల జీవితం.. యాంత్రిక జీవన విధానంలో పేద, మధ్య తరగతి వర్గాల్లో అధిక శాతం ప్రజలు ద్విచక్ర వాహనాలు వాడుతున్నారు. ఒక్కో ఇంట్లో రెండు మూడు బైకులు సైతం ఉన్నాయి. మధ్య తరగతిలో కొద్ది మెరుగైన ఆదాయం ఉన్నా వారు సొంత కారును కలిగి ఉంటున్నారు. ఏ వాహనం నడవాలన్నా పెట్రోల్, డీజిల్ తప్పనిసరి. ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా అనేక మంది కొత్త బంకులను స్థాపించాలనే చూస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు అమలవుతున్నాయా? వినియోగదారులు ఆయా బంకుల యజమానులను ప్రశిస్తున్నారా? పినపాక మండల వ్యాప్తంగా బంకులు ఉన్నప్పటికీ, సగం శాతం పెట్రోల్ బంకుల్లో మౌలిక సౌకర్యాలు అమలు కావడం లేదు. మండలంలో వ్యాప్తంగా మొత్తం మూడు పెట్రోల్ బంకులు ఉన్నాయి. పెట్రోల్ బంక్‌లకు అనుమతి మంజూరు చేసేటప్పుడు యజమాలు పది నియమాలను ఖచ్చితంగా పాటిస్తామని, అన్ని సౌకర్యాలు ఉండే విధంగా బంకులు నిర్వహిస్తామని సంబంధిత అధికారులకు రాతపూర్వకంగా హామీ ఇస్తున్నారు. అనంతరం వారి ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. ప్రధానంగా బంకుల యజమానులు వినియోగదారులకు ఎయిర్ మిషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా వినియోగదారులకు ఉచితంగా ఎయిర్ అందించాల్సి ఉంటుంది. డబ్బులు మాత్రం అడుగవద్దు. బంకు వద్ద ప్రథమ చికిత్సకోసం ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేసి వాటిలో ఉండే మందులపై గడువు తేదీ తప్పకుండా ఉండాలనే నిబంధన ఉంది. గడువు తేదీ అయిపోతే వాటిని వెంటనే బాక్స్ నుంచి తొలగించాలి. తాగునీరు, ఉచిత ఫోన్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫిర్యాదు బాక్స్, పెద్ద అక్షరాలతో ధరల పట్టిక, ఫైర్‌సేఫ్టీ డివైజర్స్, బిల్లు ఇవ్వడం, క్వాంటిటీ, క్వాలిటీ కోసం 5లీటర్ల క్యాన్ ఇలా ప్రతి బంకులో వినియోగదారులకు సౌకర్యాలు ఉండాలని నియమాలు ఉన్నాయి. ఈ నియమాలకు ఆయా యజమానులు వాటికి మంగళం పాడుతున్నారు. గుట్టలో ప్రతి పెట్రోల్ బంకులో నామమాత్రంగానే కేవలం నాలుగైదు సౌకర్యాలు తప్ప అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న పెట్రోల్ బంకులు ఏ ఒక్కటీ లేవు. కొంతమంది నిర్వాహకులు వినియోగదారులతో సఖ్యత లేకుండా దురుసుగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంకుల్లో ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టింపులేనట్లుగా వ్యవరిస్తున్నారు. వినియోగదారులు మాత్రం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రతీ పెట్రోల్ బంకును ఆకసిక్మంగా తనిఖీలు చేసి సౌకర్యాలను పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక వినియోగదారులు కోరుతున్నారు.పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు చట్టబద్ధంగా అందించాల్సిన సేవలను నిర్వాహకులు గాలికి వదిలేస్తున్నారు. నిబంధనల ప్రకారం కల్పించాల్సిన మౌలిక సదుపాయాలకు తిలోదకాలు ఇస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో ఇంధనాన్ని విక్రయించడమే కాదు. వినియోగదారులకు వాటిల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. కానీ అవి ఎక్కడా అమలు కావడం లేదు. తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**పెట్రోల్ బంక్‌ల్లో జరుగుతున్న మోసాలను అరికట్టండి : గొడిసాల రామనాథం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు**



పినపాక మండలంలోని పెట్రోల్ బంక్‌ల్లో యధేచ్ఛగా సాగుతున్న మోసాలను అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొడిసాల రామనాథం డిమాండ్ చేశారు. బంక్‌లో తనిఖీలు తూతూ మంత్రంగానే కొనసాగుతున్నాయని, ఇదే అదనుగా భావించిన కొందరు బంక్ నిర్వాహకులు అధికారులతో ఒప్పందాలు చేసుకుని ఈ మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు.

# అంతర పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

**-జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



ప్రజాపక్షం/ములకలపల్లి: రైతులు ఒకే పంట మీదే ఆధారపడకుండా అంతర్ పంటల సాగు ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ములకలపల్లి మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ముందుగా ములకలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మట్టితో తయారు చేసిన ఇటుకలతో నిర్మించే ప్రహరీ గోడ పనులను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానికంగా మట్టితో తయారు చేసిన ఇటుకలను ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పాతూరులో ఈదర మురళి అనే రైతు సాగు చేస్తున్నటువంటి ఫామ్ పాండ్‌లో చేపల పెంపకాన్ని పరిశీలించి, ఇంకా ఫామ్ పాండ్ అభివృద్ధి పరచటానికి, ఏ రకం చేపల పెంపకం ద్వారా ఎక్కువ ఆదాయం చేకూరుతుందో తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఒక్క పంట పైనే ఆధారపడకుండా అంతర్ పంటగ చేపల పెంపకం, మునగ, నాటు కోళ్లు, తేనెటీగల పెంపకం వంటివి సాగు చేయడం ద్వారా ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని తెలిపారు. ఈ అంతర పంటల సాగుకు ఎన్ఆర్‌జిఎస్ ద్వారా మునగ పంట వేసుకున్న వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు సబ్సిడీలు అందుతాయని అదే విధంగా పంట చేనులో ఫారం ఫాండ్లు ఎన్ఆర్‌జిఎస్ ద్వారా తీయడం జరుగుతుందని, ఈ ఫారం ఫాండ్లలో రైతులు చేపల పెంపకం చేసుకుంటే లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ఎంపీడీవో రేవతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల గ్రాడ్యుటి హెచ్చు తగ్గులను చెల్లించాలి



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి మణుగూరు ఏరియా 2017 సంవత్సరంలో రిటైర్మెంట్ పొందిన (ఎన్‌సిడబ్ల్యూఏ) మాజీ ఉద్యోగుల గ్రాడ్యుటి హెచ్చు తగ్గుల విషయంలో రాష్ట్ర లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రతులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు శనివారం మణుగూరు వారి నివాస గృహమునందు పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది భరత్ కుమార్ గణేష్ రెడ్డి, రాజేశ్వరరావు తదితరులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మణుగూరు సీనియర్ కార్మిక నేత విశ్రాంత ఉద్యోగి పిచ్చేశ్వరరావు మాట్లాడుతూ మణుగూరు నుండి 2017 దిగిపోయిన విశ్రాంత ఉద్యోగులు తమకు రావలసిన పట్టుకున్న పైసా విషయంలో 105 మంది రాష్ట్ర లేబర్ కోర్టులో సీనియర్ న్యాయవాది సురేందర్ రెడ్డి, భరత్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర లేబర్ కోర్టు లో పిటీషన్ గత జూలై మాసంలో నమోదు చేయగా జనవరి మొదటి మాసంలో తీర్పు కార్మికులకు అనుకూలంగా వచ్చిందని దానిని వెంటనే సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి మిగతా 20 లక్షలు కు లోబడి వారి వారి అర్హతలను బట్టి బకాయిలను చెల్లించే విధంగా సింగరేణి యాజమాన్యా దృష్టికి తీసుకుపోవాల్సిందిగా శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుని కోరారు.

## వార్మింగ్ డే వాయిదా

ప్రజాపక్షం/భద్రాచలం : ఈనెల 10న నిర్వహించనున్న నేషనల్ వార్మిగ్ డే ను తాత్కాలికంగా వాయిదా పడినట్లు జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

## జిల్లాలో మరో గిరిజన బిడ్డ సంచలనం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన నేషనల్ టైక్వాండో అండర్ 73 కేజీ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం కేంద్రానికి చెందిన పాయం హర్ష ప్రద తెలంగాణ రాష్ట్రానికి సిల్వర్ మేడల్ సాధించింది. తెలంగాణ రాష్ట్రానికి ఇంత వరకు టైక్వాండో గేమ్‌లో ఎలాంటి మెడల్ ఎవరూ తీసుకురాకపోవడం, మన జిల్లా గిరిజన బిడ్డ తీసుకురావడం ఇదే తొలి సారి కావడంతో భద్రాద్రి జిల్లా వాసులు ఆళ్లపల్లి మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు సాధించే విధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు, ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మరెన్నో పథకాలు తీసుకొచ్చే విధంగా గిరిజన బిడ్డపై చొరవ తీసుకొని సహాయ సహకారాలు అందించాలని భద్రాద్రి జిల్లా వాసులు ఆళ్లపల్లి మండల వాసులు కోరుతు మండల వ్యాప్తంగా విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

## అక్రమ మట్టి రవాణా.. జేసీబీ సీజ్



ప్రజాపక్షం / పాల్వంచ : ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ ని రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. శనివారం మండల పరిధి కొత్త సూరారం గ్రామ సమీపంలో జేసీబీతో అక్రమంగా మట్టి తవ్వకం జరిపి ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు మండల ఆర్ఐ హచ్చ మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి (టీఎస్28హెచ్6064) నంబర్ గల జేసీబీ ద్వారా అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లతో రవాణా చేస్తుండగా పట్టుకొని సీజ్ చేసి చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భద్రత నిమిత్తం పాల్వంచ పట్టణ ఎస్సై సమక్షంలో జేసీబీని స్వాధీన పరిచినట్లు ఆర్ఐ హచ్చ తెలిపారు.

## కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు మాటలు.. కార్పొరేట్లకే మూటలు



ప్రజాపక్షం/ములకలపల్లి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పేదలకు మాటలు..కార్పొరేట్లకే మూటలుగా కేంద్ర బడ్జెట్ ఉందని సిఐటి యు మండల కన్వీనర్ నిమ్మల మధు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రహదారిపై ప్లకార్డులతో నిరసన కార్యక్రమం తెలియజేసినారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఓరుగంటి శ్రీను అధ్యక్షతనలో జరిగిన సభలో నిమ్మల మధు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్పొరేట్లకు అనుకూలంగా కష్టజీవులకు వ్యతిరేకంగా ఉందని ఆరోపించారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు గడదాసు గోపాలరావు, భూక్య భద్రు, ఆశా వర్కర్ బోర్రా లలిత, మద్దెల యోగి, నాగేష్, రామక్రిష్ణ, సున్నం క్రిష్ణ పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్




ప్రజాపక్షం/భద్రాచలం : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను నిలువునా మోసం చేశారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు ఆరోపించారు. శనివారం దుమ్ముగూడెం మండల పరిధిలోని పైడిగూడెం పంచాయితీ స్థాయి సమావేశం పైడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి, అరచేతిలో వైకుంఠాన్ని చూపించిందని, తీరా అధికారం చేజిక్కించుకుని గద్దెనెక్కిన తర్వాత మాట మారిందన్నారు. ఆరు గ్యారెంటీలు, పంటరుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.2500, కౌలురౌతులకు రూ.10వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలు ఇస్తామని ప్రకటించారని, రేషన్ కార్డులు, ఆరోగ్య పథకం అందరికీ ఇస్తామన్నారని కానీ, నేటికి అవి అమలు కాకపోవడం దుర్మార్గం అన్నారు. ఇచ్చిన వాగ్దానాలు ఎటుపోయాయని, కేసిఆర్‌కు నీకు పెద్ద తేడా ఏముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలుకై సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో ఈనెల 20న ఛలో హైదరాబాద్ కదలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముక్తి సత్యం, ముసలి సతీష్, సమ్మక్క, సూర్యాకాంతం, నాగమణి, కొండలరావు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**-సేంద్రియ సాగును ప్రోత్సహించాలి**
**-మెగా ఆర్గానిక్ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధవహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయని దాని వల్ల అనారోగ్యాల భారీనపడుతున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని టిడిపి ఆఫీస్ పక్కన గల సమీకృత కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామ భారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆర్గానిక్ మేళాను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. రసాయనాలు ఎక్కువగా వినియోగించిన ఆహార పంటలను తినడం వల్ల అనారోగ్యాల భారీనపడుతున్నారన్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు ప్రజలు గురవుతున్నారన్నారు. జంక్, ఫాస్ట్ ఫుడ్‌లకు బదులు సేంద్రియ పద్ధతిలో ఎటువంటి రసాయనాలు వాడకుండా పండించిన పంటలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని మంత్రి తెలిపారు. మన పూర్వీకులు మనం తినే ఆహార పదార్థాలను ఇంటి పేరట్లోనో, చేలల్లోనో పండించుకుని తినే వారని అందువల్లనే ఆరోగ్యంగా ఉండేవారని మంత్రి తెలిపారు. ఇప్పుడు ప్రజలు కూడా అవిధంగా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆహార పంటలను వినియోగించాలని తెలిపారు. ప్రభుత్వం తరుపున కూడా సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్గానిక్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వహాకులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెలలో నిర్వహించిన ఆర్గానిక్ మేళాకు అపూర్వ స్పందన లభించిందని ఆయన తెలిపారు. వినియోగదారుల స్పందన మేరకు ప్రతి నెల రెండవ శనివారం, ఆదివారం ఆర్గానిక్ మేళాను గ్రామభారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేళాలో సేంద్రియ పద్ధతిలో సాగు చేసి పండించిన కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలు, దంపుడు బియ్యం, దేశవాళి ఆవు నెయ్యి, గానుగ నూనెలు, వనమూలికల పొడులు, పసుపు, బెల్లం, తేనె, చేనేత వస్త్రాలు, జూట్ బ్యాగులు వంటివి లభిస్తాయని తెలిపారు. ఆదివారం కూడా ఆర్గానిక్ మేళా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన పంటలను ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, చావా నారాయణరావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రామభారతి బాధ్యులు కుతుంబాక మాధవి, నాగేశ్వరరావు, నరేంద్ర స్వరూప్, సేంద్రియ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతగల కమ్యూనిస్టు చవగాని రాములు



**ప్రజాపంక్షం/కొణిజర్ల :** పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసిన చవగాని రాములు నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకుడని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిదిలోని అమ్మపాలెంలో శనివారం చవగాని రాములు 14వ వర్థంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతు గ్రామంలో పార్టీ అభివృద్ధికోసం ఆయన క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన కడవరకు ఎర్ర జెండా నీడలో పయనించాడని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలను ఆయన ఎంతో నేర్పుతో పరిష్కరించేవాడని తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీ గెలుసుకోసం ఆయన ఎంతో కృషిచేసేవాడని స్పష్టంచేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ అమ్మపాలెం గ్రామశాఖ కార్యదర్శి మునిగె కోటేశ్వరరావు, అమ్మపాలెం రైతుసంఘం కర్యాదర్శి జడ వెంకన్న, అధ్యక్షులు వెంపటి నరసింహారావు, పుప్పాల వెంకటేశ్వర్లు, గుగులోత్ రాము, టిఆర్ఎస్ మండల నాయకులు కిలారు కిరణ్, కోసూరి వెంకటలాలు, కోసూరి సత్యం, పుప్పాల బ్రహ్మయ్య, రావిళ్ల సుబ్బారావు, సువర్ణకంటి సిరియాల, రాములు కుటంబసభ్యులు చవగాని లాలయ్య, చవగాని సైదులు, పెద్దపిచ్చయ్య, చిన్న పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కల్లూరు:** భీష్మ ఏకాదశి సందర్భంగా శనివారం కల్లూరు లోని కాకతీయ పంచదార పరిశ్రమలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విష్ణు సహస్రనామ పూజలు, భగవద్గీత పారాయణం తో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్న మహిళా భక్తులు తోపాటు కల్లూరు పట్టణం మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పంచదార పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు.

# సింగరేణి జిఎంకి వినతి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో జిఎం ఎం షాలేం రాజుకు కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఎంవి నరసింహారావు, కొత్తగూడెం ఏరియా అధికారుల సంఘ సభ్యులు పెర్ఫార్మెన్స్ రిలేటెడ్‌పే పీఆర్పిని ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత ఆర్థిక సంవత్సరం 202223, 202324లో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో అధికారుల పాత్ర ఎంతగానో ఉందని, దీనికి సంబంధించిన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్‌పే పీఆర్పిని ఇంతవరకు అధికారులకు అందజేయలేదని, పైన తెలిపిన ఆర్థిక సంవత్సరం పీఆర్పి లను కోల్ ఇండియా సంస్థ వారు జూన్ 2024 లో చెల్లించారని అన్నారు. కానీ మన సింగరేణి సంస్థ నందు ఇంతవరకు ప్రస్తావన లేదని అధికారులు అసంతృప్తి, ఆందోళన చెందుతున్నారని అన్నారు. సరైన వసతులు లేకున్నా కూడా సంస్థ అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమిస్తున్న అధికారులను ప్రోత్సాహపరిచే పెర్ఫార్మెన్స్ రిలేటెడ్‌పే పీఆర్పిఇవ్వాలని కోరారు. జిఎం స్పందిస్తూ పెర్ఫార్మెన్స్ రిలేటెడ్‌పే పీఆర్పి లను ఇప్పించుటలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా సీఎంఓఎఐ ప్రెసిడెంట్ ఎం.వి నరసింహారావు, వైస్ ప్రెసిడెంట్ రమేష్, అజ్మీర శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ఏ. ఉపేందర్ బాబు, జాయింట్ సెక్రెటరీ ప్రదీప్, జాయింట్ ట్రెజరర్ వైవి రావు, బీఈసీ సభ్యులు యాదగిరి, శేషశ్రీ, కొత్తగూడెం ఏరియా సీఎంఓఎఐ సభ్యులు పాల్గొన్నారు.

# బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్





**ప్రజాపక్షం/మణుగూరు:** ఖమ్మం జిల్లా నెహ్రూ యువ కేంద్ర వారి సహకారంతో కెసిఆర్ నగర్ యూత్ క్లబ్ ప్రెసిడెంట్ బి. మురళీకృష్ణ, సయ్యద్ షారుక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ కొత్తగూడెం జిల్లా గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మణుగూరు నందు వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ (షటిల్), 200 మీటర్ రన్నింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు, ప్రిన్సిపాల్ కెప్టెన్ దొడ్డి భద్రయ్య, సీనియర్ కామర్స్ లెక్చరర్ జి. రామ తిరుపతి వారి చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్టు, మెడల్స్, మెమెంటోస్ మరియు సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన కోచ్ ఎం.నాగిరెడ్డి కి నెహ్రూ యువ కేంద్ర ధన్యవాదాలు తెలిపింది.

# లింగమంతుని జాతర దుకాణాల వేలంపాట



**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఈనెల 16 నుండి 18 వరకు రేగులగండిలో అశ్వాపురం మం డల యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లింగమంతుని జాతరలో దుకాణాల నిర్వహణ నిమిత్తం వేలంపాటను శనివారం అశ్వాపురంలోని రామాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా వేలంపాటలో గెలుచుకున్న దుకాణాలదారులు కమిటీ నిర్ణయాలకు లోబడి నడుచుకోవాలని కమిటీ నిర్వహకులు తెలియజేశారు. ఈకార్యక్రమంలో లింగమంతుని జాతర కమిటీ నిర్వాహకులు, పెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచలో బీజేపీ శ్రేణులు సంబరాలు



**ప్రజాపక్షం / పాల్వంచ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ భారీ మెజారిటీతో గెలవడంతో పాల్వంచలో బీజేపీ పార్టీ శ్రేణులు సంబరాలు జరిపారు. శనివారం ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పొనిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా ప్రజలు బీజేపీ వైపు నిలబడి మోడీ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఏ ఎన్నిక జరిగిన ప్రజలు మెజార్టీగా బీజేపీ పార్టీని గెలిపిస్తున్నారన్నారు. ఈ దేశం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రాలు అభివృద్ధి చెందాలన్నా కేవలం మోడీ నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి మండల అధ్యక్షులు గుగులోత్ శంకర్, పాల్వంచ పట్టణ కార్యదర్శి మాదారపు లక్ష్మ ణ్, గుండు రాజు, మాళోత్ ప్రశాంత్, వెంకన్న, అజ్మీరా రాము, బియ్యని విజయ్, కమురుద్దీన్, దొడ్డ రాంబాబు, నరేందర్, సత్యం, శ్రీనుగౌడ్, హరి, కాంద్రతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి విజయం పట్ల హర్షం

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించడం పట్ల బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారన్నారు. కావున తెలంగాణలో కూడా ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో నాయకులు బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, బిజెపి జిల్లా నాయకులు తెల్ల నరసింహారావు, నున్న రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, భూక్య రాజేష్ భూక్య శ్రీను, రమేష్, పూరేటి వెంకటేశ్వర్లు, సిరిపురపు పుల్లారావు, గోపాలరావు, సురేందర్, బిజెపి కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# కాలువ శుభ్రం చేయాలని వినతి



**ప్రజాపక్షం / పాల్వంచ :** పాల్వంచ, ములకలపల్లి ప్రధాన రహదారి అనుకొని ఉన్న పట్టణ పరిధిలోని తెలంగాణ నగర్ వెళ్లే సీసీ రోడ్డు పక్కన గల కాలువ చాలా రోజుల క్రితం మట్టి, చెత్తతో నిండిపోయింది. ఆ కాలువను తక్షణమే శుభ్రం చేయాలని శనివారం తెలంగాణనగర్ వాసులు పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..పట్టణంలో మట్టి, చెత్తతో నిండిపోయిన కాలువలను తక్షణమే శుభ్రం చేసి వ్యాధుల భారిన పడకుండా ప్రజలను కాపాడాలని కోరారు.

# రేషన్‌కు రెక్కలు..!

-దర్జాగా దారి మళ్లిస్తున్న దళారులు
-ఆంధ్రా వ్యాపారికి అనుచరులుగా సత్తుపల్లి, సదాశివునిపేట వ్యాపారులు
-పోలీసులకు పట్టుబడినా వెరవని వైనం





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రేషన్ బియ్యానికి రెక్కలు వచ్చాయి, దర్జాగా తెలంగాణనుండి ఆంధ్రాకి వందల టన్నుల బియ్యం తరలిపోతున్నాయి. సత్తుపల్లి, వేంసూరు మండలాలను అడ్డాలుగా చేసుకున్న ఆంధ్రాలోని కొందరు వ్యాపారులు. సత్తుపల్లి మండలంలోని సదాశివునిపేట, రేజర్ల, రాజీవ్ నగర్ కాలనీ, సిద్ధారం, జవహర్ నగర్, ద్వారకాపురి కాలనీ, గీతా మందిరంతో పాటు, వేంసూరు మండలంలోని మర్లపాడు, కందుకూరు, భరణిపాడు, పల్లెవాడ, వెంకటాపురం, భీమవరం తదితర ఏరియాలలో పదుల సంఖ్యలో దళారులను ఏర్పాటు చేసుకున్న ఆంధ్ర వ్యాపారులు సాయంత్రం 6 నుండి 9 గంటల లోపు దర్జాగా సేకరించిన బియ్యాన్ని దారి మళ్ళిస్తున్నారు. ఈ మధ్యకాలంలో అడపా, దడపా దాడులు జరుగుతుడటంతో వ్యాపార సామ్రాజ్యాన్ని గురుభట్లగుడంలోని ఓ ఇంటిని స్థావరం గా చేసుకున్నారని, ఇక్కడ సేకరించిన బియ్యాన్ని దళారులు ద్విచక్ర వాహనాలు ఆటోల ద్వారా గురుభట్లగూడెం, గుడిపాడు లకు చేరవేస్తుండటంతో అక్కడ నుండి దర్జాగా లారీల్లో లోడ్ చేసుకొని మహారాష్ట్రకు తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఈ మధ్యలో ఎటువంటి అవాంతరాలు జరగకుండా కొందరు అధికారులకు భారీగానే ముడుపులు ముట్ట చెబుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సత్తుపల్లి పోలీస్ స్టేషన్లలో అక్రమ రేషన్ బియ్యం తరలించిన వాహనాలు పదికి పైగానే పట్టుబడి దర్శనమిస్తున్నాయి. వాహనాలు పట్టుబడిన దళారులు మాత్రం వెరవకుండా దర్జాగా వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటున్నారే తప్ప, అక్రమ వ్యాపారం నుంచి తప్పుకోవడం లేదని ప్రజలు చెప్పుకోవడం విశేషం. ముగ్గు వ్యాపారం ముసుగులో అక్రమ రేషన్ దందా కూడా భారీ గానే సత్తుపల్లిలో రాజ్యమేలుతుంది. గతంలో కొందరి వాహనాలను ఆంధ్ర వ్యాపారులు పట్టించడంతో వివాదాలు కూడా భారీగానే చెలరేగాయని, ఒకానొక సమయంలో దాడులు కూడా చేసుకున్నట్లు తెలిసింది. ఈ మధ్యకాలంలో వ్యాపార సామ్రాజ్యంలోకి అడుగుపెట్టిన ఓ డాన్ కొందరిను తన అనుచరులుగా ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తుండగా, దానికి అనుచరులుగా కొనసాగుతున్న వారు కూడా సత్తుపల్లి, సదాశివపేటలకు చెందిన ఇద్దరు వ్యక్తులను ప్రధాన అనుచరులుగా నియమించుకుని ఇక్కడ వ్యవహారాలన్నిటిని చక్కబెడుతూ భారీగానే బియ్యాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఒకటో తారీకు నుండి 20వ తారీకు వరకు సత్తుపల్లిలో పేదలకు అందుతున్న రేషన్ బియ్యం, పెద్దలకు కాసులు కురిపిస్తుండడం గమనార్హం. అధికారులు అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వారిపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి వారి ఆటలు కట్టించాలని, వరుసగా పట్టుబడిన వారిపై రౌడీ షీట్లు ఓపెన్ చేస్తేనే అక్రమ వ్యాపారం ఆగుతుందని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు.

# పంచాయతీలకు 300 కేంద్రాలు

ఎంపీటీసీలకు 94 పోలింగ్ కేంద్రాలు గుర్తింపు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. మండలం లోని ఓటర్ల జాబితా ప్రక్రియ పనులను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తామంతా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. 18 ఎంపీటీసీలకు గాను 94 పోలింగ్ కేంద్రాలను, 32 గ్రామ పంచాయతీలకు 300 పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలకు మండల కేంద్రంలోని ఐదు ప్రభుత్వ కార్యాలయాలలో నామినేషన్ల కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. అదే విధంగా పంచాయతీ పాలక వర్గాలకు నామినేషన్ల కు సంబంధించి 10 నామినేషన్ల కేంద్రాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలం లోని ఎంపీటీసీ, సర్పంచలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, అసిసెంట్ రిటర్నింగ్ అధికారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. మండలం లో ఎన్నికల కు సంబంధించిన పనులను పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# ఆసుపత్రి కార్మికుల వేతనాల కోసం నిరసన




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యశాలలో ఆసుపత్రి కార్మికులు జీతాలు కోసం గత మూడు రోజులుగా పలు విధాలుగా రోజువారి కార్యక్రమంలో భాగంగా వేతనాలు కోసం నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా కల్లూరు ఆసుపత్రి కార్మికుల గౌరవాధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, కార్మికుల జీతాలపై సంవత్సరానికి ఒకసారి మాదిరిగా జీతాలు చెల్లిస్తుందని గత ఏడు నెలలు క్రితం సమ్మె నోటీస్ ఇస్తే వేతనాలు వేశారని మళ్ళీ సమ్మె నోటీసు జనవరి నెలలో ఇచ్చామని నాలుగు నెలలుగా కార్మికుల జీతాలు ఇవ్వడంలో కాంట్రాక్టర్, ప్రభుత్వ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని జిల్లా ఉపాధ్యక్షులు విమర్శించారు. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో వేతనాలకై ప్రతి రోజు ఒక గంట నిరసన కార్యక్రమం ధర్నాలో భాగంగా చెవిలో పువ్వులు, మోకాళ్లపై ఉండి నిరసన, నల్ల బ్యాడ్జీలు, కార్యక్రమాలను చేస్తున్నామని అధికారులకు, ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నామని కార్మికుల పిల్లల సదువులు ఇంటి అద్దెలు చెల్లించలేక జీతాలు అందక జీవనం ఇబ్బందికరంగా తయారైందని అన్నారు. రాబోవు రోజుల్లో ఆందోళనను ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉధృతం చేస్తామని రాంబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కార్మికులు నాగమణి, సరోజిని, సురేంద్ర, ప్రమోద్, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్‌కు కాకర్లపల్లికి రెండోస్థానం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్‌కు సత్తుపల్లి మండలం కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించి, జిల్లాలో కాకర్లపల్లి పాఠశాలను రెండవ స్థానంలో నిలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 100 మంది విద్యార్థులను ఈ ఉపకార వేతనానికి ఎంపిక చేయగా వారిలో సత్తుపల్లి మండలానికి చెందిన వారు 33 మంది ఎంపికయ్యారు. అత్యధిక సంఖ్యలో ఉపకార వేతనానికి ఎంపికైన జాబితాలో జిల్లాలో సత్తుపల్లి మండలానికి ప్రథమ స్థానం దక్కిన్నట్లు విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావు తెలిపారు. ప్రతి సంవత్సరం జాతీయస్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ ఫలితాలు శుక్రవారం ప్రకటించగా, కాకర్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు ఎంపిక అయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిభ పరీక్ష నిర్వహిస్తుంది. ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 4 సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున స్కాలర్షిప్ అందజేస్తారు. ఉపకార వేతనానికి అర్హత సాధించిన జాబితాలో సంఖ్యాపరంగా కాకర్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. జిల్లా మొత్తం మీద 100 మంది విద్యార్థులను ఉపకార వేతనానికి ఎంపిక చేయగా వారిలో 10 మంది విద్యార్థులు కాకర్లపల్లి హైస్కూల్ నుంచి ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్ .రాజేశ్వర రావు (సత్తుపల్లి మండల విద్యాధికారి) హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపకార వేతనానికి ఎంపికైన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు మేడా సత్యనారాయణ, జల్లిపల్లి మురళి, నాతి రమేష్ లతో పాటు వీరికి తోడ్పాటు అందించిన ఇతర ఉపాధ్యాయులను రాజేశ్వరరావు అభినందించారు.

# నూతన వధూవరులను దీవించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన తుమ్మల వీరాభిమాని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు తమ్మిన రవి కుమార్ శైలజల కనిష్ట కుమార్తె అశ్రీత అన్వేష్ ల వివాహ వేడుక శనివారం వారి స్వగృహంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, దీవించారు. తుమ్మల వెంట రాష్ట్ర కాంగ్రెస్ నాయుకులు డా. మట్టా దయానంద్ విజయ్ కుమార్, చల్లగుళ్ళ నర్సింహరావు, వినుకొండ కృష్ణ , పువ్వాళ్ళ ఉమ, టోపీ శ్రీను, నరేంద్ర రెడ్డి, పల్లె రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీఓగా రాజారావు బాధ్యతలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు నూతన ఎంపీఓగా రాజారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. మండల గ్రామ పంచాయతీ అధికారిగా డిప్యూటేషన్ పై ఖమ్మం రూరల్ మండలం రఘునాథపాలెం నుండి కల్లూరులో శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలలోని కార్యదర్శులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని, స్థానికంగా ఉన్న సమస్యలను కార్యదర్శి ద్వారా పరిష్కారం కానిచో తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. రాబోవు వేసవి దృష్ట్యా మంచినీటి సమస్య ఉంటే తెలపాలని గ్రామాల పరిపాలనకు ప్రజలు సహకరించాలని కోరారు.

# కల్లూరులో బిజెపి సంబరాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** దేశ రాజధానిలో భారతీయ జనతా పార్టీ గెలుపొందడం పట్ల కల్లూరు లోని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యకర్తలు టపాసులు పేల్చుతూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ప్రజలు పరిపాలనను సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని దీనివలన ఆకర్షితులై ఢిల్లీ పీఠాన్ని దక్కించుకున్నారని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండపునేని అనిల్ కుమార్, పసుపులేటి సుబ్బారావు, రంగురవి, వంగల శ్రీను, రాచబంటి శ్రీను, మాడిశెట్టి విజయకుమార్, కృష్ణమాచారి, కృష్ణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏన్కూరులో బిజెపి శ్రేణుల సంబరాలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి గెలిచిన సందర్భంగా ఏన్కూరులో బిజెపి శ్రేణులు శనివారం ఘనంగా సంబరాలు జరిపారు. బిజెపి మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధాని సెంటర్‌లో టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోపూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఢిల్లీలో ఎంతోకాలం తర్వాత బిజెపి అధికారం రావడంతో దేశం మొత్తంలో సంబరాలు జరుపుకుంటున్నామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చే విధంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా సెక్రటరీ నరుకుళ్ళ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు మోరబోయిన కృష్ణ, గిరిజన మోర్చా జిల్లా సెక్రటరీ ఈసం రమేష్, సీనియర్ నాయకులు వజినేపల్లి దర్గయ్య, ఏర్పుల బిక్షం, రెంతపల్లి నారాయణ, బూత్ అధ్యక్షుడు అంజి, లక్ష్మ ణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని లంకపల్లి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండాలపాడు గ్రామానికి చెందిన రావిలాల పవన్ సాయి (20) అనే బిటెక్ విద్యార్థి ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివిఎం బంజర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కోదండ రాముని ద్విదశాబ్ది ఉత్సవాలు

## -11న ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ కోదండ రాముని ద్విదశాబ్ది ఉత్సవాలు ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ద్విదశాబ్ది సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. చైతన్యానికి ప్రతీక గ్రామంగా చెప్పుకునే రాపల్లి గ్రామంలో ప్రజలంతా ఏకమై శ్రీ కోదండ రామాలయాన్ని నిర్మించారు. అంతకు ముందు ఊరికి వెలుపల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం మాత్రమే ఉండేది. భక్తులు ఇబ్బందులుపడుతున్నారన్న ఆలోచనతో 2004 జూన్ రెండవ తేదీన శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి వేద పండితుల ఆశీర్వచనముల మధ్య శంఖుస్థాపన చేశారు. అప్పట్లో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ గ్రామ ప్రజలు, భక్తులు విదారంగా వ్యవహరించారు. స్థాయికి మించి దేవాలయ నిర్మాణానికి సహకరించారు. 2005 ఫిబ్రవరి 15న వేద మంత్రోచ్ఛరణల నడుమ వేలాది మంది భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ కోదండరాముడు కొలువుదీరాడు. గ్రామానికి దాతల సహకారం ఈ సందర్భంగా స్ఫూరణకు తెచ్చుకోవాలి. స్థలం నుంచి మొదలు ధ్వజస్తంభ ప్రతిష్ట గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లికి గుడి నిర్మాణం, ఆంజనేయ స్వామిని ఊరి వెలుపల నుంచి తెచ్చి గ్రామంలో ప్రతిష్టించడం, భక్తుల సౌకర్యార్థం గదుల నిర్మాణం, ప్రహరీ గోడ, కళ్యాణ మండపం, బోరు ఏర్పాటు వరకు గ్రామానికి చెందిన వివిధ కుటుంబాలు భూరీ విరాళాలు ఇచ్చి శ్రీ కోదండ రామాలయం భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంది. అప్పటి నుంచి నిత్య పూజలతో శ్రీ కోదండ రామాలయం అలరారుతుంది. గాదె సత్యనారాయణ రెడ్డి నిర్మాణ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించగా శ్రీరామ భక్తుడు రామదాసు కుటుంబం అందించిన సహకారం, సేవలు మరువలేనివి.

### ప్రత్యేక పూజలు : ఛైర్మన్



ద్విదశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ మందడపు చంద్రశేఖర్‌రావు తెలిపారు. రెండు దశాబ్దాలుగా రాపల్లి గ్రామంలో కొలువైన శ్రీ కోదండ రాముని ద్విదశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కాగలరని తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

# ఐక్య ఉద్యమాలతోనే ఇండ్ల స్థలాల సాధన




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మూడు దశాబ్దాల జర్నలిస్టుల సొంతింటి కల సహకారం చేసుకునేందుకు జర్నలిస్టులు ఐక్యతతో ఉద్యమాలకు సిద్ధం కావాలని ఖమ్మం స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు పిలుపునిచ్చారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్‌బాబు అధ్యక్షతన శనివారం జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం జరిగిన యుద్ధభేరీ సన్నాహక సమావేశంలో సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు పాల్గొని ప్రసంగించారు. అనేక ఏళ్లుగా జర్నలిస్టులు ఇండ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని కాని జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగించటం బాధాకరమన్నారు. ఇప్పటికే అనేక మార్లు మంత్రులను, అధికారులను సంప్రదించామని కాని అనుకున్న లక్ష్యం ఇంకా నెరవేరకపోవడం బాధను కలిగిస్తుందన్నారు. మూడు ప్రధాన యూనియన్లు, హౌసింగ్ సొసైటీతో పాటు ప్రెస్‌క్లబ్ కమిటీతో కలిసి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దెటి రమేష్‌బాబు, ప్రెస్‌క్లబ్ వేదికగా యుద్ధభేరీ మోగించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు ఉపాధ్యక్షులు మోహినుద్దీన్, టిజెఎఫ్ నగర ఉపాధ్యక్షులు అమరవరపు కోటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ కోశాధికారులు నామ పురుషోత్తం, బిక్కి గోపి, ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి తెలిపారు. శనివారం సహాయ కమిషనర్ కార్యాలయంలో వివిధ దేవాలయాల కార్యనిర్వహక అధికారులు, నిర్వహక అధికారులు, ఆలయ అర్చకులు, ఛైర్మన్లతో సహాయ కమిషనర్ వీరస్వామి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహాశివరాత్రి సందర్భంగా వివిధ ఆలయాల వద్ద చేపట్టాల్సిన చర్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్స్, పారిశుధ్యం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, రవాణా సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల భద్రత కోసం సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం సహాయ కేంద్రాలను దేవాలయాల వద్ద అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్లు, కార్యనిర్వహక అధికారులు, నిర్వహణ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

## పల్లిపాడు వద్ద చెట్లు నరికివేత







**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో నేషనల్ హైవే ప్రక్కన ఉన్న పచ్చని పెద్ద పెద్ద చెట్లని వారి సొంత అవసరాల కోసం నరికివేశారు. ఒక పక్క రోడ్ల ప్రక్కన పెద్ద ఎత్తున మొక్కలను పెంచుతుంటే దానికి విరుద్ధంగా వారి వ్యాపార సముదాయాలకు అడ్డొస్తుందని పెద్దపెద్ద చల్లని నీడనిచ్చే చెట్లను నరికారు. అసలే ఎండలు ప్రారంభమయ్యాయి. పల్లిపాడు సమీపంలోకి రాగానే ఎంతోమంది వాహనదారులు అక్కడ ఉన్న పచ్చని నీడ క్రింద సేద తీర్చుకుంటున్నారు. అలాంటి పట్టణ చెట్లను ఇప్పుడు నరికారు. చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# అన్నిదానాల్లో కన్న అన్నదానం మిన్న



**ప్రజాపక్షం/ మధిర :** అన్ని దానాల్లో కన్న అన్నదానం మిన్న అని శ్రీ కళ్యాణ వెంకటేశ్వస్వామి ఆలయ కమిటీ సభ్యులు కపిలవాయి జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. శనివారం అన్న గోవిందం కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వారికి 18వ వార్షికోత్స వేడుకలు సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దాతలు కపిలవాయి మల్లికార్జున్‌రావు, ధనలక్ష్మి, పుల్లఖండం చంద్రశేఖర్, పద్మావతి, రాళ్లబండి వెంకటసుబ్బయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా ఫ్రూట్స్ డే



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు శనివారం ఫ్రూట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి.అంజన బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పండ్లు, కూరగాయల్లో ఉండే పోషకవిలవలు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల మానసిక వికాసానికి దోహదపడుతాయని, విద్యతో పాటు ఆటపాటలతో వత్తిడి లేని విద్యనందించటమే శ్రీనిధి లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రరమంలో స్కూల్ డైరెక్టర్ చందు, టీచర్స్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శనివాం ఘనంగా నిర్వహించారు. స్థలదాత రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మఠం ఆస్థాన పండితులు రామడుగు నర్సింహాచారి ముఖ్యఅతిథులుగా పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వాన్ని శాసించిన విశ్వకర్మ కాలజ్ఞాన రచన కర్త శ్రీ పోతులూరి వీరబ్రహేంద్రస్వామి విగ్రహావిష్కరణ ఎంతో మహోన్నతమైందని, ఈ కులంలో పుట్టిన మనం ఎంతో అదృష్టవంతులమని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షలు బాజోజు శేషభూషణం, గౌరవ సలహాదారులు ఇందోజు బ్రహ్మయ్య, బండారు వీరబ్రహ్మం తాటికొండ సత్యనాఆరయణ, కొక్కొండ సత్యం, నర్సింహాచారి, సుబ్రహ్మణ్యం, వెంకటాచారి, కత్తరోజు సునీత, విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడలో బిజెపి విజయోత్సవ సంబరాలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** దేశ రాజధాని ఢిల్లీలో బిజెపి పార్టీ అధిక అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని విజయం సాధించడం పట్ల బిజెపి మండల అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ రోడ్డులో బాణసంచా కాల్చి స్విట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి అధికారంలో ఉంటేనే దేశ ప్రగతి సాధ్యమని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందరికీ సమానంగా అందుతున్నాయని అన్నారు. బిజెపి పార్టీ మీద, ప్రదాని నరేంద్రమోదీపైన ఉన్న నమ్మకంతోనే ఢిల్లీ ప్రజలు బిజెపికి పట్టం కట్టారని, ఢిల్లీ ఓటర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తేజవత్ బాలాజీ, సంగీతం సాయిచంద్, చోడ నాగేశ్వరరావు, కటిక నర్సింహారావు, పులి వెంకటేశ్వర్లు, ఉదయగిరి రామారావు, వేము అశోక్, పుల్లారావు, బత్తుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.